క్లుప్తంగా

పింఛన్ల పెంపు అభినందనీయం



మామిడివాడలో పింఛను అందజేస్తున్న దృశ్యం

రాంబిల్లి : పింఛన్ల పెంపు అభినందనీయమని జగనన్నకు అండగా నిలవాలని మామిడివాడ వైఎస్సార్‌సీపీ నాయకుడు నెట్టెం సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్ మోటూరు రాఘవేంద్ర అన్నారు. లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు. లబ్ధిదారులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు రామన్నపాలెంలో గడప గడపకు

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురం మండలంలోని రామన్నపాలెం గ్రామంలో ఈ నెల 5వ తేదీన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు దేశంశెట్టి శంకర్‌రావు తెలిపారు. ఎమ్మెల్యే యు.వి.రమణమూర్తి రాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ ఈ కార్యక్రమంలో పాల్గొంటారని, కోవిడ్ నిబంధనలు పాటిస్తూ నాలుగు మండలాలకు చెందిన పార్టీ నాయకులు, ప్రతినిధులు హాజరు కావాలని ఆయన సూచించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించాలి

రాంబిల్లి : రాజుకోడూరులో తాగునీటి సమస్యను పరిష్కరించాలని సర్పంచ్ ముత్తా శంకర్రావు అన్నారు. బుధవారం ఈ గ్రామంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజలు తాగునీటి సమస్యతో సతమతమవుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే ప్రభుత్వ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వెంకట కృష్ణ పలువురు వార్డు సభ్యులు పాల్గొన్నారు.

ఆస్పత్రిలో రోగికి పింఛను అందజేత



కాకినాడ ఆస్పత్రికి వెళ్లి పింఛను అందిస్తున్న వలంటీర్

పాయకరావుపేట : పట్టణంలో గల సచివాలయం -3 పరిధిలో పెట్ల రాజేష్‌కుమార్ అనే పింఛను దారు కాకినాడ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. గ్రామ వలంటీర్ ఎం.తలుపులు కాకినాడ ఆస్పత్రికి వెళ్ళి అతనికి పింఛను అందించాడు. పెరిగిన పింఛను అందుకోవడంతో పింఛనుదారుడు ఆనందం వ్యక్తం చేసినట్టు వలంటీర్ తెలిపారు.

పెరిగిన పింఛనుతో మరింత భరోసా



రామన్నపాలెంలో వికలాంగ బాలుడికి పింఛను అందిస్తున్న పార్టీ నాయకులు

కోటవురట్ల: పింఛను నగదు పెంపుతో లబ్ధిదారులకు మరింత భరోసా కలుగుతోందని సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు అన్నారు. మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో కొత్తగా మంజూరైన పింఛన్ల పంపిణీ బుధవారం నిర్వహించారు. నీలిగుంట గ్రామంలో సర్పంచ్ కన్నంరెడ్డి వరహాలబాబు, రామన్నపాలెంలో వైఎస్సార్ సీపీ నాయకులు గోపాలకృష్ణ, శ్రీను, కె.వెంకటాపురంలో పైల నాని, గొల్లు చిట్టిబాబు చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు.

ఇసుక ట్రాక్టరు పట్టివేత



పట్టుబడ్డ ఇసుక ట్రాక్టరు

కోటవురట్ల: ట్రాక్టరుతో అక్రమంగా ఇసుక తరలిస్తుండగా పోలీసులు పట్టుకున్నారు. ఎస్‌ఐ నారాయణరావు తెలిపిన వివరాల ప్రకారం పందూరు శివారున ఎటువంటి అనుమతి లేకుండా ట్రాక్టరులో ఇసుక తరలిపోతుండగా బుధవారం దాడి చేసి పట్టుకున్నారు. ట్రాక్టరును పోలీసు స్టేషన్‌కు తరలించి అపరాధ రుసుము విధించినట్టు ఎస్‌ఐ తెలిపారు.

'తులసీ'వనంలో సేవా పరిమళం

- మునగపాకతో తులసీరావుకు ఎంతో అనుబంధం
- కోట్లాది రూపాయలతో పలు అభివృద్ధి పనులు

మునగపాక : విశాఖ డెయిరీ చైర్మన్ దివంగత నేత ఆడారి తులసీరావుతో మునగపాక మండలానికి విడదీయరాని అనుబంధం ఉంది. నిత్యం రైతుల సంక్షేమానికి ఆయన పెద్దపీట వేయడంతో పాటు రైతుల కమతాలకు వెళ్లే ర హదారులు, కళ్యాణ మండపాలు, కల్వర్టులు వంటి అభివృద్ధి పనులకు తులసీరావు అందించిన సేవలను నేటికీ ఈ ప్రాంత ప్రజలు గొప్పగా చెప్పు కుంటారు. గత ఏడాది ఆక్టోబర్ 6న జరిగిన దసరా సందర్భంగా ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ ఆధ్వర్యంలో ఘనంగా పౌర సత్కారం నిర్వహించిన విషయం తెలిసిందే.

అభివృద్ధి పనులకు ధారాళంగా నిధులు

మండలంలోని మెలిపాక నుంచి యాదగిరిపాలెం మీదుగా యలమంచిలి చేరుకునేందుకు వీలుగా రూ.8.5 కోట్ల వ్యయంతో తులసీ వారధి నిర్మించారు. అలాగే మునగపాకలో కళాకారులు తమ ప్రదర్శన ఇచ్చేందుకు పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తులసీ కళావేదిక ఏర్పాటుకు రూ.25లక్షలు మంజూరు చేశారు. రూ.75 లక్షల వ్యయంతో బీసీ కాలనీని ఆనుకొని కళ్యాణ మండపం నిర్మించారు. తోటాడ త్రిమూర్తుల ఆలయ సమీపంలో ఆవకాలువపై రూ.25 లక్షలతో బ్రిడ్జి, మూలపేట వద్ద రూ.12 లక్షలతో బ్రిడ్జి, మంగళవరపుపేటలో రూ.18 లక్షలతో కళ్యాణమండపం, అరబుపాలెంలో రూ.25 లక్షలతో కళ్యాణమండపం, మడకపాలెంలో రూ.45 లక్షలతో కళ్యాణమండపం, చెర్లోపాలెంలో రూ.30 లక్షలతో కళ్యాణమండపం, తిమ్మరాజుపేటలో రూ.15 లక్షలతో కళ్యాణమండపం, నాగవరంలో రూ.27లక్షలతో కళ్యాణమండపం, తోటాడలో రూ.15 లక్షలతో కల్యాణమండపం, చూచుకొండలో చెరువును కప్పించేందుకు రూ.15 లక్షలు, తిమ్మరాజుపేట నుంచి వాడ్రాపల్లికి వెళ్లేందుకు వీలుగా రూ.15 లక్షలతో గ్రావెల్ రోడ్డు, నాగులాపల్లి నుంచి తోటాడకు వెళ్లేందుకు వీలుగా ఉండేలా రూ.12 లక్షలతో గ్రావెల్ రహదారులు తులసీరావు హయాంలో జరిగాయి. మునగపాకలో శ్మశాన వాటిక అభివృద్ధి, లోతట్టుగా ఉండే మునగపాక హైస్కూల్, ఎంపీయూపీ స్కూల్ క్రీడా ప్రాంగణాలను గ్రావెల్‌తో ఎత్తు చేయించారు. రైతుల కమతాల్లో కూడా లక్షలాది రూపాయలతో గ్రావెల్ రోడ్లు నిర్మించారు. ఇలా అన్ని వర్గాల ప్రజలకు తులసీరావు హయాంలో ఎంతో మేలు జరిగింది.



మునగపాకలో కళాకారుల కోసం రూ.25 లక్షలతో నిర్మించిన తులసీ కళావేదిక

రైతులకు అందుబాటులో ధాన్యం కొనుగోలు కేంద్రాలు



ఎస్.రాయవరంలో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించిన ఎమ్మెల్యే గొల్ల బాబూరావు



వేంపాడులో ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు గ్రామాలకు అనుసంధానం కలిగిన ప్రాంతాల్లో ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. ఎస్.రాయవరం రైతు భరోసా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. మండలంలో ఇది రెండో ధాన్యం కొనుగోలు కేంద్రమని చెప్పారు. కాయకష్టం చేసి పండించిన ధాన్యం దళారుల పాలు కాకుండా ప్రభుత్వం కల్పిస్తున్న భరోసా అని పేర్కొన్నారు. ప్రభుత్వం నుంచి నిర్దిష్టమైన మద్దతు ధర ఉన్నప్పుడు ప్రైవేటు వ్యాపారులు తక్కువ ధరలకు ధాన్యం కొనలేరన్నారు. ఖరీఫ్, సీజన్ ఎరువులు, విత్తనాలు రాయితీలు మొదలుకుని పంట చేతికి వచ్చిన తరువాత ఆదుకునేలా చేయడం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే చెల్లిందని కొనియారు. ఈ కార్యక్రమంలో ఎస్.రాయవరం పీఏసీఎస్ చైర్‌పర్సన్ అల్లాడ నాగరాజు, వైఎస్సార్‌సీపీ నాయకులు కర్రి బాబ్జి, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, వ్యవసాయాధికారి సౌజన్య తదితరులు పాల్గొన్నారు.

గిట్టుబాటు ధర కల్పించడమే లక్ష్యం

నక్కపల్లి : రైతులకు గిట్టు బాటు ధర కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. బుధవారం ఆయన వేంపాడు పీఏసీఎస్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రైతులను అన్ని విధాలా ఆదుకోవాలనే కృత నిశ్చయంతో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఉన్నారన్నారు. ఈ కార్యక్రమాల్లో భాగంగానే పెట్టుబడి సాయం కింద ఖరీఫ్‌కు ముందుగానే రైతు భరోసా పథకం కింద ప్రతి ఏటా రూ.13,500 సాయం చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు సబ్సిడీపై అందజేయడం జరుగుతోందన్నారు. పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు తక్కువ వడ్డీకే రుణాలను అందించడం జరుగుతోందన్నారు. రుణాలు తీసుకున్న రైతులు సకాలంలో వాయిదాలు చెల్లించాలన్నారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ సూరాకాసుల రామలక్ష్మి ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బాబూరావును గజమాలతో సత్కరించారు. అనంతరం రైతుల నుంచి ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, నక్కపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు యలమంచిలి తాతబాబు, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సూరాకాసుల గోవిందు, శీరం నర్సింహమూర్తి, బొల్లం బాబ్జీ, ఎంపీటీసీలు లొడగల చంద్రరావు, మధు పాల్గొన్నారు.

పెంచిన పింఛన్లతో గడపగడపలో ఆనందం



గడపగడపకూ కార్యక్రమంలో లబ్ధిదారుతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గొల్ల బాబూరావు

ఎస్.రాయవరం : గ్రామాల్లో స్థానిక సమస్యలు తక్షణమే పరిష్కరించాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. తిమ్మాపురం శివారు గోకులపాడు గ్రామంలో బుధవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే గ్రామంలో ప్రతి గడపకూ వెళ్లి పలకరించారు. ప్రభుత్వ పథకాలు అందుకున్న కరపత్రంతో ఎమ్మెల్యే ముందుకు వచ్చి జగనన్న కానుకలు తామంతా అందుకున్నామని చెప్పారు. స్థానికంగా మా గ్రామంలో వీధిలైట్లు వెలగడం లేదని, అలాగే తాగునీటి కుళాయిలు సక్రమంగా రావడం లేదని పలువురు ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేయగా ఆయన వెంటనే విద్యుత్ శాఖ, పంచాయతీ అధికారులను పిలిచి సమస్య రెండు రోజుల్లో పరిష్కరించాలని ఆదేశించారు. అలాగే పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని కార్యదర్శి రామిరెడ్డిని ఆదేశించారు. ఈ క్రమంలో పింఛను అందుకున్న అవ్వా తాతలను పలకరించి ఈ నెల పింఛను ఎంత అందుకున్నావు, ఎవరిచ్చారని ప్రశ్నించారు. జగన్‌బాబు చెప్పిన మాట ప్రకారం పింఛను పెంచుతూ రూ.2750 ఇచ్చారని, అది కూడా ఇంటి వద్ద అందిస్తున్నారని ఆనందం వ్యక్తం చేస్తూ చెప్పుకొచ్చారు. గ్రామస్తులు ఆనందాన్ని చూసి ఎమ్మెల్యే సంతృప్తి వ్యక్తపరిచారు. కార్యక్రమంలో సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, పలు గ్రామాల సర్పంచ్‌లు చోడిపల్లి శ్రీనివాస్, కొప్పిశెట్టి సత్యం మల్లే లోవరాజు, ఎస్.రాయవరం, పెనుగొల్లు పీఏసీఎస్ చైర్‌పర్సన్‌లు అల్లాడ నాగరాజు, దోసపాత్రుని హనుమంతరావు, మాజీ సర్పంచ్ అద్దేపల్లి నూకునాయుడు, వైస్ ప్రెసిడెంట్ అద్దేపల్లి బాబూరావు వైఎస్సార్‌సీపీ నాయకులు నాగంబోయిన శ్రీనివాస్‌రావు, పోలిశెట్టి పెద ఈశ్వరరావు, మైలారు శ్రీనివాస్‌రావు, నేలపూడి రామలక్ష్మి, నలమాటి ఆనంద్,రాజు, ఎంపీడీవో రామచంద్రమూర్తి, మండల ఇంజినీర్ దుర్గాశంకర్, వెలుగు ఏపీఎం శివప్రసాద్, ఏపీవో సత్యవతి తదితరులు ఉన్నారు.

పల్లకిలో వెంకన్న తిరువీధి సేవలు



రాత్రి హంస వాహనంలో ఊరేగిస్తున్న దృశ్యం

నక్కపల్లి : ధనుర్మాసం సందర్భంగా బుధవారం ఉపమాకలో వేంకటేశ్వర స్వామివారికి పల్లకిలో తిరువీధి సేవలు నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక పూజలు అనంతరం స్వామివారిని పెద్దపల్లకిలో ఉంచి ఊరేగించారు. స్వామివెంట గోదాదేవి అమ్మవారిని చిన్నపల్లకిలో తిరువీధి సేవలు నిర్వహించారు. ఆండాళ్లమ్మవారి సన్నిధిలో తిరుప్పావై 20 పాశురాన్ని విన్నపం చేసారు. రాత్రి స్వామివారిపి హంస వాహనంపై ఊరేగింపు జరిపారు. కార్యక్రమంలో ప్రధానార్చకులు వరప్రసాద్, అర్చక స్వాములు కృష్ణమాచార్యులు, శేషాచార్యులు,గోపాలాచార్యులు పాల్గొన్నారు.

వాడ్రాపల్లిలో పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు అందజేస్తున్న వర్తక సంఘ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

మునగపాక : మండలంలోని పలు ప్రాంతాల్లో బుధవారం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ జన్మదిన వేడుకలు ఘనంగా జరిగాయి. మునగపాక పీహెచ్‌సీలో రోగులకు పండ్లు, రొట్టెల పంపిణీ జరిగింది. వాడ్రాపల్లిలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి హాజరైన అనకాపల్లి వర్తక సంఘ అధ్యక్షుడు కొణతాల లక్ష్మీనారాయణ మాట్లాడుతూ కొణతాల రామకృష్ణ మంత్రిగా పనిచేసిన కాలంలో ఈ ప్రాంతం ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. నిస్వార్థ రాజకీయాలకు ఆయన కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారన్నారు. కార్యక్రమంలో కొణతాల అభిమానులు నేమాల పూర్ణశంకరరావు, పొలమరశెట్టి నూకాలయ్య, బొడ్డేడ వెంకన్న, దాడి చిన్నారావు, శరగడం శ్రీనివాసరావు, కొణతాల నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో మహిళలకు ఆర్థిక స్వావలంబన

డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ లక్ష్మీపతి

మునగపాక : ప్రభుత్వ పథకాలు, రుణాలను సద్వినియోగం చేసుకొని ప్రతి డ్వాక్రా మహిళ స్వయం ఉపాధి ద్వారా ఆర్థిక స్వావలంబన సాధించాలని డీఆర్‌డీఏ పీడీ బి.లక్ష్మీపతి కోరారు. మునగపాక వెలుగు కార్యాలయంలో బుధవారం ఆహార ఉత్పత్తుల తయారీలో ఆర్థిక స్వావలంబనపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనకాపల్లి క్లస్టర్ పరిధిలోని మునగపాక, రాంబిల్లి, కశింకోట, అనకాపల్లి మండలాలకు చెందిన 40 మంది లబ్ధిదారులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా లక్ష్మీపతి మాట్లాడుతూ చిరుధాన్యాలు, ఆహార పదార్థాలకు మార్కెట్‌లో ప్రస్తుతం మంచి గిరాకీ ఉందన్నారు. బేకరీ ఐటమ్స్ చిప్స్, చెగోడీలు, చెక్కలు, బెల్లంతో తయారు చేసిన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలన్నారు. మహిళల జీవనోపాధికి ఒక్కో సభ్యురాలికి రూ.40 వేల వంతున స్త్రీ నిధి ద్వారా రుణం అందజేస్తామన్నారు. పీఎంఎఫ్‌ఎంఈ కింద రాష్ట్రంలో ఆహార ఉత్పత్తుల తయారీ ద్వారా 7559 మందికి లబ్ధి చేకూరుతుందని సెర్ప్ అడిషనల్ డైరెక్టర్ కె.సరళ తెలిపారు. ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సత్యనారాయణ, డీపీఎం సంజయ్, ఏరియా కో-ఆర్డినేటర్ ధర్మారావు, ఏపీఎం కొండమ్మ, మండల సమాఖ్య అధ్యక్షురాలు మరిడమ్మ, వెలుగు సీసీలు ప్రకాష్, లలిత, ఉష కార్యక్రమంలో పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



నక్కపల్లిలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వీసం తదితరులు

నక్కపల్లి : పింఛన్లను రూ.2750 పెంచి ఇచ్చిన మాట నిలబెట్టుకున్న జగన్‌మోహన్‌రెడ్డి చరిత్రలో నిలిచిపోతారని కాపు కార్పొరేషన్ డైరెక్టర్, విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు వీసం రామకృష్ణ అన్నారు. బుధవారం ఆయన సర్పంచ్ రత్నకుమారితో కలసి నక్కపల్లి సచివాలయంలో నూతనంగా మంజూరయిన పింఛన్లను పంపిణీ చేశారు. వచ్చే ఎన్నికలనాటికి పింఛను మూడు వేల రూపాయలకు పెంచుతారన్నారు. ఈ సందర్భంగా పింఛను లబ్ధిదారులతో కలిసి సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఉపసర్పంచ్ వీసం రాజు, స్థానిక నాయకులు బంగార్రాజు, ముద్దాశ్రీను, దుర్గాప్రసాద్, నానాజీ పాల్గొన్నారు.

15న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు

- పోస్టర్ ఆవిష్కరణ



పోటీల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నిర్వాహకులు

మునగపాక : సంక్రాంతి పర్వదినం సందర్భంగా మునగపాకలో ఈ నెల 15న జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహిస్తున్నట్టు పోటీల నిర్వాహకులు దాడి ముసిలినాయుడు, కోరుకొండ ప్రసాద్ సంయుక్తంగా తెలిపారు. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను వారు బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగు రైతు ఆధ్వర్యంలో ఏటా క్రమం తప్పకుండా జిల్లా స్థాయి ఎడ్ల బళ్ల పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అలాగే గుర్రాల పరుగు పోటీలు కూడా నిర్వహిస్తామని తెలిపారు. పండగ సందర్భంగా గ్రామీణ ప్రాంత శోభను చాటిచెప్పాలనే ఆశయంతో ఈ పోటీలు నిర్వహిస్తున్నామని వివరించారు. రైతులంతా ఉత్సాహంగా పాల్గొని ఈ పోటీలను విజయవంతం చేయాలన్నారు.

కార్యక్రమంలో పోటీల నిర్వాహకులు ఆడారి గోవింద, విల్లూరి నూకనరసింగరావు, పెంటకోట శ్రీరామమూర్తి, దాడి భీమునాయుడు, బీలా లక్ష్మణరావు, పవన్ తదితరులు పాల్గొన్నారు.

సమీకృత మిశ్రమ దాణా ద్వారా అధిక పాల దిగుబడులు



రైతులకు సమీకృత మిశ్రమ దాణా అందజేస్తున్న పశు వైద్యాధికారి ప్రదీప్‌కుమార్

మునగపాక : సమీకృత మిశ్రమ దాణా పశువులకు అందించడం ద్వారా పాల దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని మునగపాక పశువైద్యాధికారి లావేటి ప్రదీప్‌కుమార్ అన్నారు. బుధవారం మునగపాకలో పాడి రైతులకు సమీకృత మిశ్రమ దాణా అందజేశారు. ఆయన మాట్లాడుతూ పాడిరైతులకు సమీకృత మిశ్రమ దాణాను రాయితీపై అందజేస్తున్నామన్నారు. ప్రతి ఆర్‌బీకేలో పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కిలో రూ.15.80కాగా ప్రభుత్వం రూ.9.30 భరిస్తుందని రైతు తన వాటాగా రూ.6.50 చెల్లించాల్సి ఉందన్నారు. మేలు జాతి పశువుల కొనుగోలుపై దృష్టి సారించాలన్నారు.

అచ్యుతాపురం జంక్షన్‌లో డ్రైనేజీ పనులు



అచ్యుతాపురం జంక్షన్‌లో అండర్ డ్రైనేజీ పనులను చేపడుతున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురంలో ప్రధాన రహదారుల విస్తరణలో భాగంగా డ్రైనేజ్ వ్యవస్థ విఫలం కావడంతో అచ్యుతాపురం జంక్షన్‌లో ప్రవహిస్తున్న మురుగు నీటి సమస్యకు చెక్ పడనుంది. ఈ ప్రాంతంలో అండర్ డ్రైనేజీ నిర్మాణాలను ప్రారంభించారు. ఈ ప్రాంతంలో ఫ్లైఓవర్ సైతం రానుండటంతో అండర్ డ్రైనేజ్ పనులను భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని చేపడుతున్నారు.

కొత్త రేవుపోలవరం సరిహద్దుల పరిశీలన



కొత్త రేవుపోలవరం సరిహద్దులు చూస్తున్న డీపీవో శిరీషారాణి

ఎస్.రాయవరం : పంచాయతీల నుంచి వచ్చే ఆదాయం పెంచేలా సర్పంచ్‌లు, స్థానిక పంచాయతీ అధికారులు కృషి చేయాలని అనకాపల్లి జిల్లా డీపీవో శిరిషారాణి అన్నారు. కొత్త రేవుపోలవరం, రేవుపోలవరం పంచాయతీలలో పంచాయతీలు ప్రత్యేకంగా ఉన్నా రెవెన్యూ ఆదాయం రావడం లేదని చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం డీపీవో పంచాయలను సందర్శించారు. గ్రామ సర్పంచ్‌లు గ్రామపెద్దలతో సమావేశమై వివరాలు సేకరించారు. 1995లో పంచాయతీలు ఏర్పడినప్పటికీ ఈ పంచాయతీ హద్దులు నిర్ణయించిన వివరాలు లేవని గ్రామస్తులు వివరించారు. అయితే పంచాయతీలు విడదీసినప్పుడు నిబంధనలకు లోబడే చేస్తారని, పాత రికార్డులు పరిశీలించి అధికారులు పంచాయతీలకు రావాల్సిన భూమి కేటాయించి,తద్వారా ఆదాయం, హక్కులు పంచాయతీలకు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. సుమారు 25 సంవత్సరాలుగా ఉన్న సమస్యను నిశ్చితంగా పరిశీలించాలన్నారు. గ్రామ సభ, తీర్మానాలు తీసుకుని హద్దులకు రెవెన్యూ అధికారులు సహకారం తీసుకుని హద్దులు నిర్ణయించాలన్నారు. ఈ సందర్భంగా నర్సీపట్నం డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వేయర్ కె.బంగారు దేవి, గ్రామపెద్దలు చూపిస్తున్న హద్దులు పరిశీలించి తీర్మానాలు వేగంగా పనులు పూర్తి చేయాలన్నారు. మ్యాప్‌లు, జీపీఎస్ ద్వారా పరిశీలించి త్వరలో సర్వే నిర్వహించి హద్దులు గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం డీఎల్‌పీవో మూర్తి, ఈవోపీవోఆర్డీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు రామలక్ష్మి, ప్రసాద్, మోహన్, సర్పంచ్ మల్లే లోవరాజు, ఉప సర్పంచ్ చోడిపల్లి గోవిందు తదితరులు పాల్గొన్నారు.

తులసీరావుకు ఘనంగా నివాళి



చినదొడ్డిగల్లులో తులసీరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

నక్కపల్లి : విశాఖ డెయిరీ చైర్మన్ మరణం ఉత్తరాంధ్ర జిల్లాల్లో పాడి రైతులకు తీరని లోటని వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి అన్నారు. తులసీరావు మృతి పట్ల వారు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం రాత్రి చినదొడ్డిగల్లు బల్క్ మిల్క్ కూలింగ్ సెంటరు వద్ద తులసీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. డెయిరీ చైర్మన్‌గా పాడిరైతులకే కాకుండా గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు, విద్యాసంస్థల్లో సదుపాయాల కల్పనకు డెయిరీ తరపున ఎంతో సహాయ సహకారాలు అందించారన్నారు. డెయిరీ లాభాలను రైతులకు పంపిణీ చేసి వారి అభిమానాన్ని చూరగొన్నారన్నారు. తులసీరావు మృతి పట్ల ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు, కాపు కార్పొరేషన్ డైరక్టర్ వీసం రామకృష్ణ, విశాఖ డెయిరీ డైరెక్టర్ రెడ్డి రామకృష్ణ, జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మణిరాజు, మండల పార్టీ అధ్యక్షుడు పాపారావు, వైస్ ఎంపీపీ వీసం నానాజీ, పార్టీ నాయకులు శీరం నర్సింహమూర్తి, సూరాకాసుల గోవిందు, తోట సత్తిబాబు, ఎంపీటీసీలు తోట సత్తిబాబు, చంద్రరావు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు, కురందాసు నూకరాజు కొప్పిశెట్టి కొండబాబు, టీడీపీ నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, మీగడ సత్తిబాబు పలు గ్రామాల్లో ఉన్న పాల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, వేతన కార్యదర్శులు సంతాపం తెలిపారు.

మొదలైన సమ్మేటివ్ పరీక్షలు



సమ్మేటివ్-1 పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

అచ్యుతాపురం (అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో బుధవారం నుంచి సమ్మేటివ్ -1 పరీక్షలు ప్రారంభం అయ్యాయి. ఈ నెల 10వ తేదీ వరకూ పరీక్షలు నిర్వహించనున్నారు. అనంతరం ప్రభుత్వ పాఠశాలలకు సంక్రాంతి సెలవులు ప్రకటించనున్నారు. ఇప్పటి వరకూ ప్రభుత్వ పాఠశాలల్లో ఫార్మేటివ్ -1, ఫార్మేటివ్-2 పరీక్షలు పూర్తి అయ్యాయి. వచ్చే ఏడాది నుంచి సెమిస్టర్ విధానం అమలు కానుండడంతో ఈ తరహా పరీక్షల విధానంలో పూర్తి మార్పు రానుంది.

7న భోగలింగేశ్వర ఆలయ భూమి వేలం

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం భోగలింగేశ్వర స్వామి ఆలయంలో స్వామివారి హక్కుభుక్తంలో గల భూమికి ఆలయ ఆవరణలో ఈ నెల 7న వేలంపాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ బుధవారం తెలిపారు. మునగపాక మండలం నాగులాపల్లి గ్రామంలో సర్వే నెం.209/2లో 3.46 ఎకరాల భూమిని ఈ ఏడాది ఏప్రిల్ నుంచి 2026 మార్చి వరకు మూడేళ్ల కాలానికి కౌలుకిచ్చేందుకు టెండర్, వేలంపాట నిర్వహిస్తామన్నారు. ఆసక్తిగల వారు రూ.లక్ష సాల్వెన్సీ సర్టిఫికెట్‌తోపాటు రూ.5 వేల ప్రథమ ధరావతు చెల్లించి పాటలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు. హెచ్చు పాటదారు ఏడాదిపాటు శిస్తు దేవస్థానానికి చెల్లించాలన్నారు.

థియేటర్ అనుమతుల పరిశీలన



పి.ధర్మవరంలో నూతన థియేటర్‌ను పరిశీలిస్తున్న ఆర్డీవో భవానీ శంకర్

ఎస్.రాయవరం : మండలంలో నర్సీపట్నం ఆర్డీవో భవానీ శంకర్ బుధవారం పర్యటించారు. పి.ధర్మవరంలో అదనపు థియేటర్ నిర్మాణంలో భాగంగా అనుమతులు పరిశీలించేందుకు వచ్చినట్టు చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి రెవెన్యూ సిబ్బందితో మాట్లాడారు.

హెచ్‌ఐవీ పట్ల అవగాహన అవసరం



రాట్నాలపాలెంలో అవగాహన కల్పిస్తున్న జోనల్ సూపర్‌వైజర్ రమణ

కోటవురట్ల : హెచ్‌ఐవీ పట్ల అవగాహన కలిగి ఉండడంతో పాటు వ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష లేకుండా వ్యవహరించాలని చైల్డ్ లింక్ వర్కర్స్ స్కీమ్ జోనల్ సూపర్‌వైజర్ డి.రమణ అన్నారు. రాట్నాలపాలెంలో ఏపీ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థల ఆధ్వర్యంలో హెచ్‌ఐవీపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ రక్త పరీక్షలు చేయించుకోవాలన్నారు. హెచ్‌ఐవీ రాకుండా జాగ్రత్త పడాలని, వ్యాధిగ్రస్తులకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ అనిల్‌కుమార్, ఎంపీటీసీ రాంబాబు, కార్యదర్శి సుబ్రహ్మణ్యం, లింక్ వర్కర్ కె.లక్ష్మి, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.